




పురాతన శాసనాన్ని చూపుతున్న మైనాస్వామి

'పది'ంతల శ్రద్ధ..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అక్షర క్రమంలో ముందున్న అనంతపురం జిల్లాను పదవ తరగతి ఉత్తీర్ణతలోనూ అగ్రభాగాన నిలిపే లక్ష్యంతో విద్యా శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. 'అనంత సంకల్పం' పేరుతో ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టడమే కాకుండా వారి విద్యాభ్యాసం జరుగుతున్న తీరును కూడా ఇళ్ల వద్దకెళ్లి ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపి మెరుగైన ఫలితాలు వచ్చేలా 'పది'ంతల ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. అనంతపురం జిల్లాలో ఈ ఏడాది 35,305 పదవ తరగతి పరీక్షలు రాయనున్నారు. ఇందులో 30 వేల మంది రెగ్యులర్ పరీక్ష రాస్తుండగా తక్కిన వారు గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులున్నారు. జిల్లాలో 313 ప్రభుత్వ పాఠశాలల్లో 17,249 మంది విద్యార్థులు ఈ సారి 10వ తరగతి పరీక్షలు రాయనున్నారు.



అనంత సంకల్పం కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ప్రతిభ తెలుసుకుంటున్న డిఇఒ

ప్రభుత్వ పాఠశాలల్లో 'అనంత సంకల్పం'

గతేడాది పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అనంతపురం జిల్లా ఆఖరు భాగాన నిలిచింది. 49.70 శాతం మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ఈ శాతాన్ని ఈ ఏడాది పెంపొందించేందుకు విద్యాశాఖ 'అనంత సంకల్పం' పేరుతో ప్రత్యేక కార్యచరణ రూపొందించారు. దీన్ని వారం వారం జిల్లా కలెక్టర్ సమక్షంలో పర్యవేక్షించడం జరుగుతోంది. ఇందులో భాగంగా ఏడు రౌండ్లలో విద్యార్థులకు అదనపు క్లాసులు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం అదనపు క్లాసులు తీసుకున్నారు. ప్రతి వారంవారం పరీక్షలు నిర్వహించారు. ప్రీ ఫైనల్ కూడా అయిపోయాయి. పూర్తి స్థాయి పరీక్షలు దగ్గరపడుతున్న సమయంలో ముఖ్యమైన సబ్జెక్టులపై మరోమారు విద్యార్థులకు బోధించడం జరుగుతోంది. విద్యార్థులు ఇళ్ల వద్ద



చదువుతున్నారా.? లేదా.? అన్న పర్యవేక్షణ సైతం చేపడుతున్నారు.

పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం

పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు విద్యా శాఖ చేపడుతోంది. ఏప్రిల్ 3వ తేదీ నుంచి ఈ పరీక్షలు ప్రారంభం కానున్నాయి అనంతపురం జిల్లా పరిధిలో మొత్తం 139 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. జిల్లా కేంద్రం అనంతపురం నగరంలోనే 30 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటు అధికారుల నియామకాలు చేశారు. విద్యార్థుల్లోనూ పరీక్షలపై అవగాహన కార్యక్రమాలను సైతం ఆ శాఖ చేపడుతోంది.

ఉత్తీర్ణత శాతం పెంచుతాం

గతేడాది పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో చివరిగా అనంతపురం జిల్లా ఉంది. ఈసారి ఉత్తీర్ణత శాతం పెంచుకునే దిశగా ప్రణళికను రూపొందించాం. మంచి ఫలితాలు వచ్చేందుకు అవసరమైన కార్యచరణను చేపట్టాం. విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. ఇళ్ల వద్ద ఏ విధంగా చదువుతున్నారన్నది కూడా పర్యవేక్షిస్తున్నాం. విద్యార్థుల్లోనూ మానసిక స్థైర్యాన్ని నింపి మంచి మార్కులు సాధించే విధంగా కృషి చేస్తున్నాం.

సాయిరామ్, జిల్లా విద్యాశాఖ అధికారి, అనంతపురం.

హేమావతిలో పురాతన శాసనం లభ్యం

గుర్తించిన చరిత్రకారుడు మైనాస్వామి

ప్రజాశక్తి - మడకశిర

నోలంబ పల్లవ ప్రభువుల రాజధాని హేంజేరు(హేమావతి)లో హోయసల రెండో వీరబల్లాల శాసనంను గుర్తించారు. చరిత్రకారుడు మైనాస్వామి ఆధ్వర్యంలో దీనిని గుర్తించారు. హేమావతి నొలంబ శిల్ప శైలిపై పరిశోధన చేస్తున్న మైనాస్వామి దీనిని గురించి వాటి వివరాలను మంగళవారం నాడు విలేకరులకు తెలియజేశారు. హేమావతి మల్లేశ్వర స్వామి గుడి ప్రవేశ మార్గంలో గండికి అడ్డుగా పెట్టిన శాసన స్తంభాన్ని గుర్తించినట్టు వివరించారు. నోలంబ పల్లవలకు సంబంధించిన ఎన్నో శాసనాలు, చోళులు లకు చెందిన రెండు శాసనాలు హేమావతిలో ఉన్నాయన్నారు. హోయసల రాజులకు సంబంధించి ఇప్పటివరకు ఎటువంటి శాసనాన్ని గుర్తించలేదని చెప్పారు. హోయసల రెండో వీరబల్లాల శాసనం మొదటిసారిగా గుర్తించినట్టు ఆయన తెలిపారు. నోలంబ, హోయసల శాసనాల గురించి బ్రిటిష్ వారు ముద్రించిన శాసన సంపుటి 9లో "హేమావతి – హోయసల" శాసనం గురించి ఎటువంటి సమాచారం లేదని మైనాస్వామి పేర్కొన్నారు. హేమావతి నోలంబేశ్వర స్వామి గుడికి మాన్యాన్ని దానం చేసినట్టు శాసనం చెబుతున్నదని తెలిపారు. శాలివాహన శకవర్షం 1127 క్రోధన నామ సంవత్సరం ఫాల్గుణ మాసం బహుళ అమావాస్య ఆదివారం, ఆరోజు సూర్యగ్రహణం నాడు రెండో వీరబల్లాల రాజు మాన్యాన్ని ఇచ్చినట్టు శాసనంలో రాశారని తెలియజేసారు. ఆంగ్ల తేదీ ప్రకారం క్రీస్తుశకం 1206 మార్చి 12న దీనిని ఇచ్చినట్లు తెలుస్తోందన్నారు. నోలంబలను చోళరాజులు జయించిన తరువాత చాళుక్యలకు నోలంబులు సామంతులుగా పనిచేశారని చెప్పుకొచ్చారు. హేమావతిలోని శాసనాలకు ఒక మార్గదర్శి, సూచికను తయారుచేసి ముద్రించి వాటిని సందర్శకులకు అందించాలని భారత పురావస్తు శాఖకు విజ్ఞప్తి చేస్తామన్నారు.



దేశానికి మోదానీ ముప్పు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న కేంద్రం

ప్రజాశక్తి -పెనుకొండ

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తోందని సిపిఎం నాయకులు విమర్శించారు. పట్టణంలో సిఐటియు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిపిఎం ముద్రించిన దేశానికి మోదానీ ముప్పు అనే బుక్ లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు హరి మాట్లాడుతూ ఈ దేశాన్ని 2014 నుంచి పరిపాలిస్తున్న కార్పొరేట్ హిందుత్వ కూటమి ఎన్నో దారుణాలకు ఒడిగట్టిందన్నారు. జగన్ దన్నుతో రాష్ట్రాన్ని నిలువునా దోచుకోవడానికి ఉరుకులు పరుగులు పెడుతోందన్నారు. పెద్ద ఎత్తున దేశ సంపద లూటి చేసిన ఆదానికి కొమ్ముకాస్తున్న మోడీ ప్రభుత్వం పై పోరాటలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రమేష్, బాబావలి, మహబూబ్ బాషా, మూర్తి, మండల సిఐటియు నాయకులు వజ్రం నాగప్ప, చిన్న వెంకటేష్, తిప్పన్న, నరసింహులు, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పింఛను కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి - తలుపుల



మంచానికే పరిమితమైన వృద్ధుడు

ఆస్తిపాస్తులు లేక, ఆదరించేవారు లేక ప్రభుత్వం ఇచ్చే వద్ధాప్య పింఛనుపై ఆధారపడి జీవిస్తున్న ఓ శతాధిక వృద్ధుడికి 2 సంవత్సరాలు పింఛను ఆగిపోవటంతో దిక్కుతోచని స్థితిలో జీవనం సాగిస్తున్నాడు. మండలంలోని పెనబడివాండ్లపల్లి గ్రామానికి చెందిన ఎనుముల దొడ్డి కృష్ణారెడ్డికి దాదాపు వందేళ్ళ వయసు ఉంటుంది. ప్రభుత్వం ఈయనకు పింఛను ఇస్తుండేది. అయితే రెండు సంవత్సరాలు నుండి పింఛను నిలిపివేశారు. బయోమెట్రిక్ లో వేలిముద్రలు పడకపోవడం ఐరీష్ రాకపోవడంతో పింఛను ఆగిపోయినట్లు అధికారులు తెలిపారు. ఈయనకు కుమారులు గాని. ఆదరించేవారు కానీ ఎవరు లేరు. ఈ విషయమై సచివాలయ అధికారులతో అడిగిన ఫలితం లేదని వృద్ధుడు వాపోతున్నాడు. తన గోడు ఎవరికి పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తనకు అన్ని అర్హతలు ఉన్న పింఛను నిలిపివేయడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని వృద్ధుడు కోరుతున్నాడు.



జెసిబితో లేఅవుట్‌లో రాళ్లను ధ్వంసం చేస్తున్న దృశ్యం

'లెక్క' తప్పింది... లేఅవుట్ రాళ్ల తొలగింపు..!

మున్సిపల్ అధికారుల నిర్వాకంతో కౌన్సిలర్ ఆగ్రహం

ప్రజాశక్తి - మడకశిర

లేఅవుట్ ఏర్పాటులో లెక్క తప్పడంతో నగర పంచాయతీ అధికారులు ఒక అడుగు ముందుకు వేసి అక్రమ లేఅవుట్లు అన్న నినాదాన్ని తెరపైకి తెచ్చి రాళ్లు పెకిలించిన సంఘటన పట్టణంలో కలకలం సృష్టించింది. ముఖ్యంగా ఈ వివాదం రగులుకోవడానికి ఓ కౌన్సిలర్ నిర్వాకమే అన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పట్టణంలో సక్రమానికి ఏది అనుమతి ఇవ్వరు అక్రమానికి మాత్రం అన్ని తామే ముందుండి నడిపిస్తారు అన్న అభిప్రాయాలు ప్రజల్లో నాటుకుపోయాయి. మున్సిపల్ పరిధిలో లేఅవుట్లు వేయాలన్న సొంతంగా ఇల్లు , వ్యాపార సమూదాయ భవనాలు నిర్మించుకోవాలన్న లక్షలాది రూపాయలు ముడుపులు చెల్లిస్తే తప్ప అనుమతులు లభించవన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ఒకవేళ అనుమతి ఇచ్చిన తొలుత అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల్ని ప్రసన్నం చేసుకొని పనులు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొంది. పాలకపక్షనేతకు సంబంధించిన కుటుంబ సభ్యుడు ఆదిరెడ్డి పాలెం వద్ద ఆధునాతన సౌకర్యాలు ఏర్పాటు చేస్తూ లేఅవుట్ ఏర్పాటు చేశారు. అయితే మున్సిపల్ అధికారులు ఉన్న ఫలంగా వెళ్లి జెసిబి తో లేవుట్లలోని రాళ్ళను పెకిలించి వేయడంతో దుమారం చెలరేగింది. లేఅవుట్ నిర్మాణ దశలోని లక్షలాది రూపాయలు ముట్టజెప్పాలని ఆదిలోనే మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం . ఆ ప్రాంతానికి చెందిన ఓ కౌన్సిలర్ ఈ విషయంలో జోక్యం చేసుకొని ముడుపులు చెల్లించలేని పరిస్థితి ఎదురైతే పరోక్షంగా తమకు మూడు సైట్లను కేటాయించాలని బేరం పెట్టినట్లు సమాచారం. లేఅవుట్ నిర్వాహకుడు రెండు చేయలేనని కానీ నిర్ణీత ధర కంటే తక్కువగా మూడు సైట్లను ముట్టజెప్పుతానని పేర్కొనడంతో లెక్క తప్పింది, వేటు పడిందన్న వాదనలు వినపడుతున్నాయి. మొత్తం మీద బేరం కుదరకపోవడంతో ఆ ప్రాంత కౌన్సిలర్ అధికారులపై ఒత్తిడి తేవడంతో కమిషనర్ ఆగమేఘాలపై జెసిబి తో వెళ్లి లేఅవుట్లలోని రాళ్లను తొలగించే పక్రియ చేపట్టారు. విషయం తెలుసుకున్న నిర్వాహకుడు తన సోదరుడు కౌన్సిలర్‌ను వెంటబెట్టుకొని కార్యాలయం వద్ద వాగ్వాదానికి దిగాడు. ఈ విషయంపై ఎవరెవరికి ఎంత నగదు ముట్ట చెప్పింది తన వద్ద లెక్కలున్నాయని బహిరంగంగా విమర్శించారు. ఈ విషయంపై కమిషనర్ సమాధానం చెప్పకుండా అక్కడనుండి జారుకోవడం పలు అనుమానాలకు తావిచ్చింది. ముఖ్య ప్రజా ప్రతినిధి వద్దకు ఈపంచాయతీ వెళ్లింది.ఆ నేత మనోడే అని సరి చేస్తారా లేదా లెక్క తేలుస్తారా అన్నది తేలాల్సుంది.

తిరువన్నమలైకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

పుట్టపర్తి అర్బన్ : తమిళనాడు రాష్ట్రంలోని తిరువన్నమలైలోని అరుణాచల స్వామి దర్శనార్థం భక్తులకు, పర్యాటకులకు సత్యసాయి జిల్లాలోని డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు జిల్లా ఆర్టీసీ ప్రజా రవాణా అధికారి మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చైత్రమాసం పౌర్ణమి పురస్కరించుకొని స్వామి దర్శనం తో పాటు గిరి ప్రదర్శనకు ఏప్రిల్ 5న జిల్లాలోని పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం, కదిరి ఆర్టీసీ బస్సు డిపోల నుండి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. ఆయా డిపోల నుంచి 5వ తేదీన సాయంత్రం బయలుదేరి ఆరవ తేదీ ఉదయం అరుణాచలానికి చేరుకుంటాయన్నారు. అయా డిపోలలో రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

◆ మరో 24 గంటలు పెనుకొండలోనే ఉంటా..
◆ వైసిపి నాయకులకు నారా లోకేష్ సవాల్
◆ 53వ రోజు యువగళం పాదయాత్ర



సోమందేపల్లి మండలం వద్ద కియా అనుబంధ సంస్థ కార్మికులతో సెల్ఫీ తీసుకుంటున్న నారా లోకేష్

ప్రజాశక్తి-గోరంట్ల టౌన్, సోమందేపల్లి

రాష్ట్రం, పెనుకొండ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై తాను బహిరంగ చర్చకు సిద్ధమని, మరో 24 గంటలు పెనుగొండ నియోజకవర్గంలోనే ఉంటానని, దమ్ముంటే అభివద్ధిపై చర్చకు రావాలంటూ వైసిపి నేతలకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సవాల్ విసిరారు. లోకేష్ యువగళం పాదయాత్ర మంగళవారం 53వ రోజుకు చేరుకుంది. శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలోని గుమ్మయగారిపల్లి నుంచి కొత్తపల్లి, మల్లాపల్లి, పాలసముద్రం వరకు పాదయాత్ర నిర్వహించారు. మల్లాపల్లిలో ఇటుకల తయారీ కార్మికులతో భేటీ అయ్యారు. పాలసముద్రం క్రాస్ వద్ద బీసీలతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని వడ్డెర్లు, ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకులు, నారా లోకేష్‌కు విన్నవించారు. సమస్యలను పరిష్కరించాలని మల్లాపల్లి వద్ద ఇటుకుల బట్టి వేసుకుని జీవనం సాగిస్తున్న ఫిరోజ్ బాషా నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. నిర్మాణ రంగంలో కీలకంగా ఉన్న ఇటుకల తయారీ కార్మికులకు అవసరమైన సహాయ, సహకారాలు అందజేస్తామనీ, ఇటుకల తయారీని కుటీర పరిశ్రమగా గుర్తించి షెడ్ల నిర్మాణానికి సబ్సిడీ రుణాలు ఇస్తామనీ, తయారీకి అవసరమైన మట్టి, కట్టెలకు ఉచితంగా అనుమతులు ఇస్తామనీ లోకేష్ హామీ ఇచ్చారు. సాయంత్రం పాదయాత్ర సోమందేపల్లి మండలంలోకి ప్రవేశించింది. గుడిపల్లి పారిశ్రామిక వాడ దగ్గర కియా అనుబంధ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు పాదయాత్రలో వస్తున్న లోకేష్‌ను కలిశారు. అనంతరం సగర ఉప్పర కులస్తులు కలిసి వారి సమస్యలను తెలియజేశారు. గుడిపల్లి గ్రామ ప్రజలతో లోకేష్ మాటామంతి కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. రాయినపల్లి సమీపంలో యాదవ కులస్తులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ బీసీలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి సబ్సిడీ రుణాలు అందిస్తామన్నారు. టిడిపి హయాంలో రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో సైతం ఇదే రకమైన అభివృద్ధి జరిగిందన్నారు. పెనుకొండ ఎమ్మెల్యే శంకర నారాయణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు నియోజకవర్గానికి ఏం చేశావని ప్రశ్నిస్తే ఆయన తనను బూతులు తిడుతున్నాడు తప్పా అభివద్ధిని చెప్పడం లేదన్నారు. ప్రజల కోసం వైసిపి నాయకులతో ఎన్ని బూతులు తిట్టించుకోవడానికైనా సిద్ధంగా ఉన్నానని



బిసిల సదస్సులో మాట్లాడుతున్న లోకేష్

తెలిపారు. అభివృద్ధి పనులపై తాను బహిరంగ చర్చకు సిద్ధమని, ఎవరైనా దీనిని స్వీకరించవచ్చని వైసిపి నేతలకు సవాల్ విసిరారు. 2024 సంవత్సరంలో టిడిపి అధికారంలోకి రాగానే బిసిలకు రాజకీయంగా సీట్లు కేటాయించి చట్టసభల్లో అవకాశం కలిపిస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ఇవ్వండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కాలర్‌షిప్‌లు అందక పేద విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి అధికారంలోకి రాగానే ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్‌లను నేరుగా విద్యార్థులకు అందిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధిని విస్మరించి పాలన సాగిస్తున్న సైకో ప్రభుత్వానికి బుద్ధి చెప్పి సైకిల్ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే, సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బికె.పార్థసారథి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సబితమ్మ, మండల కన్వీనర్ సోమశేఖర్, పార్లమెంట్ కార్యదర్శి నరసింహులు, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, వేణు, జయరాం, ఫిరోజ్ బాషా, వెంకటరమణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌కు జననీరాజనం..

పెనుకొండ నియోజకవర్గంలో జరుగుతున్న లోకేష్ పాదయాత్రకు టిడిపి శ్రేణులు జననీరాజనం పలుకుతున్నారు. పెనుకొండ నియోజకవర్గం టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభిమానాన్ని చాటుతున్నారు. లోకేష్‌తో సెల్ఫీలు తీయించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొత్తపల్లి వద్ద హిందూపురం పార్లమెంట్ టిడిపి కార్యదర్శి నరసింహులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. పాదయాత్ర వెళ్తున్న గ్రామాల సమీపంలో ఆయా గ్రామాల టిడిపి నాయకులు భారీ పూలమాలలతో స్వాగతం పలుకున్నారు.

పట్టణాభివృద్ధిలో కమిషనర్ సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణాభివృద్ధిలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర రావు సేవలు ఆదర్శనీయమని మున్సిపల్ అధికారులు, పలువురు కౌన్సిలర్లతో పాటు వివిధ పార్టీ నాయకులు అన్నారు. హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావును నరసాపురం పురపాలక సంఘ కమిషనర్‌గా బదలీపై వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు పట్టణంలో ఈడిగ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా వీడ్కోలు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్, సచివాలయ ఉద్యోగుల జెఎసి నాయకులు బండి ఆనంద్ రాజు, సిరాల చంద్ర, జయప్రకాష్ రెడ్డి (జెపి), రామాంజి, అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్‌లు మద్దన జయరాములు, మల్లికార్జునతో పాటు పలువురు కౌన్సిలర్లు, టిడిపి కౌన్సిలర్లు రమేష్‌కుమార్, సతీష్ కుమార్, భారతీ, బిజెపి కౌన్సిలర్ అంజలి తో పాటు వివిధ పార్టీల నాయకులు కమిషనర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గత రెండు సంవత్సరాలుగా పట్టణంలో చేసిన సేవలను మాట్లాడిన ప్రతి ఒక్కరు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ ఎంఇ నీరజ, ఎఇ నాగేంద్ర, సురేష్, ఎసిపి ఆనంద్, ఆర్ఒ రంగరావు, మెప్మా టిపిఆర్ఒ హరినాథ్ రెడ్డితో పాటు అన్ని విభాగాల అధికారులు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, మహిళా సంఘాలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కమిషనర్ దంపతులను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

పంటరుణాల మొత్తాన్ని పెంచాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నంబుల పూలకుంట : ఖరీఫ్ సీజన్లో రైతులకు ఇచ్చే పంటరుణాల మొత్తాన్ని పెంచాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసంఘం నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అనంత గ్రామీణ బ్యాంకు అధికారులకు మంగళవారం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట రుణాలు మొత్తాన్ని పెంచాలన్నారు. ప్రస్తుతం భూములు ఒక ఎకరా పది లక్షల రూపాయల వరకు ధర పలుకుతున్నాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పంటరుణాల మొత్తాన్ని పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, ఎన్వీ రమణ, శేఖర్, వివి రమణ, శివ నారాయణ, నాగరాజు, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్లాసులు పంపిణీ

గాండ్లపెంట : మండల పరిధిలోని మల్ల మీద పల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో కదిరి శ్రీ తాయి జువెలర్స్ ప్రభాకర్ అండ్ సన్స్, శ్రీ పాయి చిరంజీవి, తాగి ప్రతీక్ వాస్ వారి ఆధ్వర్యంలో విద్యార్థినులకు స్టీల్ గ్లాసులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లింగాల రవీంద్రారెడ్డి,కదిరి రోటరీ క్లబ్ సెక్రటరీ తాహర్ వలి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, అరీఫ్, నాగరాజునాయక్, సిఆర్పి ఆంజనేయ నాయక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు దారుణం

కొత్తచెరువు : ఇటీవల కాలంలో దళితులపై జరుగుతున్న దాడులపై ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కటిక జయరాం, ప్రధానకార్యదర్శి సి. పాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజు రోజుకి రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని విమర్శించారు. కాకినాడ జిల్లా తొండంగి మండలం శంగవక్షం గ్రామంలో జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీంద్ర, నరేష్, రజనీకాంత్, శాంతిముని, రవిరాజ్, నాగన్న, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

నల్లచెరువు : మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ఈ ఏడాది పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పుట్టపర్తి సత్యసాయి ట్రస్ట్ సభ్యులు రైటింగ్ ప్యాడ్స్ను ఎస్ఓ శిరీష ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. వీటితోపాటు పెన్ను,సాయిబాబా ఫోటో, విభూది, విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రమణారెడ్డి, కుమ్మరవాండ్లపల్లికి చెందిన శంకర్, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీలర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఓబుల దేవర చెరువు : డీలర్ల సమస్యలు పరిష్కరించాలని మండలంలోని డీలర్లు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. దిగుమతి కూలి ప్రభుత్వమే భరించాలన్నారు. డీలర్లకు వచ్చే బియ్యము తరుగు లేకుండా ఇవ్వాలన్నారు. కమీషన్ తో కూడిన గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో డీలర్ల సంఘ నాయకులు పరమానందరెడ్డి, ఎద్దుల వెంకట రంగారెడ్డి, పరంధామ రెడ్డి, చిదానంద రెడ్డి, చిలమత్తూరు రఫీ, మంజునాథ రెడ్డి, అశ్వర్థ రెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పాదయాత్రలో విన్నవిస్తాం..

ధర్మవరం టౌన్ : పట్రా సామాజికవర్గం వారు ఎదుర్కొంటున్న సమస్యలను యువగళం పాదయాత్రలో నారాలోకేశ్ దృష్టికి తీసుకెళ్తామని పట్రా కులస్తులు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు యువగళం పాదయాత్రపై ధర్మవరం పట్రాకులస్తులు ఆత్మీయసమావేశం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడురోజుల్లో ధర్మవరం నియోజకవర్గంలోకి యువగళంపాదయాత్ర అడుగుపెడుతుందని, ఈ పాదయాత్రలో పట్రాకులస్థుల సమస్యలను నారాలోకేష్ను విన్నవిస్తామని చెప్పారు.

శానిటరీ ఇన్స్పెక్టర్పై చర్యలకు డిమాండ్

కదిరి టౌన్ : రాయదుర్గం మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ రవీంద్ర యాదవ్ పై చర్యలు తీసుకోవాలని సిఐటియు అనుబంధ మున్సిపల్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రీజినల్ డైరెక్టర్ మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ పెడరేషన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, రాష్ట్ర కమిటీ సభ్యులు జిల్లా అధ్యక్షులు, నాగరాజు, లక్ష్మీ నరసమ్మ, సీఐటీయూ న్యూ టౌన్ కార్యదర్శి మూర్తుజా,జిల్లా కోశాధికారి బత్తల ఆదినారాయణ పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-కనగానపల్లి

కనగానపల్లి,రామగిరి సీపీడబ్ల్యూ ఎస్ పథకం కింద త్రాగునీరు సరఫరా స్కీం వర్కర్లుకు బకాయి పడ్డ 17 నెలలు వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు.మంగళవారం మండల పరిధిలోని నర్సంపల్లి పంప్ హౌస్ దగ్గర కనగానపల్లి, రామగిరి మండలాల పరిధిలోని సీపీడబ్ల్యూ ఎస్ స్కీం వర్కర్ల యూనియన్ జనరల్ బాడీ సమావేశం నాగార్జున అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఇఎస్. వెంకటేష్ మాట్లాడుతూ రామగిరి,కనగానపల్లి మండలాల్లో సుమారు 54 గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే కార్మికులు 34 మంది 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నారని అన్నారు. గత కాంట్రాక్టర్ పరిధిలో ఏడు నెలలు, ప్రస్తుత కాంట్రాక్టర్ కింద పది నెలలు మొత్తం కలిపి 17 నెలల నుంచి వేతనాలు ఇవ్వకుండా కార్మికులను పండగ పూట కూడా పస్తులు పెట్టారని విమర్శించారు. గత 30 నెలలకు పైగా పిఎఫ్ అమౌంట్ కట్టకుండా ఉన్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కనీస వేతనాలు ఇవ్వకుండా పిఎఫ్ చెల్లించని కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టి వారిని బ్లాక్ లిస్ట్లో పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను సోమవారం లోపు పరిష్కరించకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. అనంతరం సిఐటియు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మంజునాథ, ఉపాధ్యక్షులుగా నరసింహులు, ముత్యాలు, నూర్ మహ్మద్ కార్యదర్శిగా నారాయణస్వామి, సహాయ కార్యదర్శులుగా ఓబుళపతి, శివయ్య, కోశాధికారిగా నాగార్జునతో పాటు 17 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.



కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

ఉపాధి పనుల పరిశీలన

మడకశిర : మండలంలోని ఆమిదాల గొంది పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను డ్వామా పీడీ రామాంజనేయులు పరిశీలించారు. పనులు చేస్తున్న కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి నేపథ్యంలో కూలీలు పనులు చేసేటప్పుడు వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని ఏపీవోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడి జయసింహ, ఏపీవో శ్రీకాంత్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

రొద్దం :మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పీడీ రామాంజినేయులు మంగళవారం పరిశీలించారు. మడకశిరలో జరుగుతున్న ఉపాధి పథకం ప్రజావేదికకు వెళుతున్న ఆయన మండలంలోనితురకలపట్నం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉపాధి సిబ్బందితో పనుల పురోగతిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జగదీష్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన రీ సర్వే పనులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో రీ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సిహెచ్. చేతన్ సర్వే అధికారులను ఆదేశించారు. రీ సర్వే పనుల పురోగతిపై మంగళవారం కలెక్టరేట్లో పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తిక్, సర్వే శాఖ ఏడి రామకృష్ణతో కలసి జిల్లాలోని తహశీల్దార్లు, డివిజనల్ స్థాయి సర్వే అధికారులు, గ్రామ సర్వేయర్లు, డిటిలు తదితరులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే పూర్తి కావడానికి ప్రణాళికలు బద్ధంగా పనిచేయాలన్నారు. ముఖ్యంగా మడకశిర, హిందూపురం, పెనుగొండ, సోమందేపల్లి, పరిగి మండలాలకు సంబంధించి రికార్డులు మరొకసారి సరి చేసుకోవాలన్నారు. సర్వేలో డిఎల్ఆర్ నమోదు ఇందులో ఎదురయ్యే సమస్యలపై జేసీ నివృత్తి చేశారు. ఒకే సర్వే నెంబర్ల లో ఇద్దరు పేర్లు ఉన్నప్పుడు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై పలు సూచనలు ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

కనుసైగ చేస్తే చాలు తరిమికొడతాం

లోకేష్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన ఎమ్మెల్యే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

ప్రజాశక్తి -పెనుకొండ

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి కనుసైగ చేస్తే చాలు టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారాలోకేష్ను మంగళగిరి వరకు తరిమికొడతామని స్థానిక ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్ నారాయణ అన్నారు. లోకేష్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే శంకర నారాయణ మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఘాటుగా స్పందించారు. లోకేష్ స్థానిక పరిస్థితుల్లో తెలియకుండా పక్కన వాళ్ళు ఇచ్చిన స్క్రిప్ట్ను చదివుతున్నాడని అన్నారు. జగన్ కనుసైగ చేస్తే చాటు లోకేష్ను జిల్లా దాటే వరకు తరిమికొడతామని అన్నారు. డీజిల్, ఇసుక దొంగలను తన పక్కన పెట్టికుని తమపై విమర్శలు చేయడాన్ని చూస్తే లోకేష్ బాబు రాజకీయ పరిజ్ఞానంపై అనుమానం వస్తుందని అన్నారు. పెనుకొండ నియోజవర్గంలో జరిగిన అభివద్ధిపై ఏ సమయంలోనైనా సరే బహిరంగకు చర్చకు రావాలని సవాల్ విసిరారు. లోకేష్ తాతకి రెండు ఎకరాలే భూమి ఉండేదని తన తాతకు 50 ఎకరాలు భూమి ఉండేదని అన్నారు. 35ఏళ్ళ రాజకీయం అంటూ విర్రవీగే పార్థసారధి అనంతపురం లో కాపురం ఉంటున్నారని, తాను పెనుకొండ లో ప్రజలకు నిత్యం అందుబాటులో వుంటున్నానని అన్నారు. మరోవైపు సవితమ్మ పై కూడా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అక్రమంగా డిజల్, కంకర వ్యాపారాలు చేసుకుంటూ కేసుల్లో ఇరుక్కొంటే తాము కేసులు పెట్టాం అంటే ఎలా అని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ, జెడ్పీటీసీ శ్రీరాములు, ఎంపీపీ రామ్మోహన్ రెడ్డి, నాయకులు జయశంకర్ రెడ్డి, నరసింహ, నాగలూరు బాబు, శ్రీనివాసులు, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందుల కొనుగోలులో అవకతవకలు : సిపిఎం

చిలమత్తూరు : చిలమత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గతంలో మెడిసిన్ కొనుగోలు చేసిన వాటిలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయని దీనిపై విచారణ చేసి అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డిప్యూటి డిఎంహెచ్ వో మంజువాణి పిహెచ్సిని అకస్మిక తనిఖీ చేసిన సందర్భంగా ఈ విశయాన్ని నాయకులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు లక్ష్మినారాయణ తదితరులు పాల్గన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ఓబుల దేవర చెరువు : మండల పరిధిలోని ఎం కొత్తపల్లిలో గల సుందరయ్య కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం నాయకులు రమణ, శ్రీరాములు, కుల్లాయప్ప , రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గజ్జల శ్రీనివాసులుకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. బోరులో మోటర్ ఉన్నా స్టార్టర్ పనిచేయడం లేదని వాపోయారు. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య కాలనీవాసులు పాల్గొన్నారు.

కష్టపడేవారికే పార్టీలో ప్రాధాన్యత

ధర్మవరం టౌన్ : తెలుగుదేశం పార్టీలో కష్టపడే వారికే ఎప్పుడు ప్రాధాన్యత ఉంటుందని టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి పరిటాలశ్రీరామ్ అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సిద్దయ్యగుట్టకు చెందిన వైసీపీ కార్యకర్తలు బాబావలి, బాషా, ఖలీల్, మహబూబ్ బాషా, రియాజ్, సాయి, అమీన్ తదితరులు టిడిపిలో చేరారు. వీరికి పరిటాలశ్రీరామ్ పార్టీ కండువా వేసి టిడిపిలోకి ఆహ్వానించారు. అనంతరం పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీనాయకులు ఫణికుమార్, పురుషోత్తం గౌడ్, కొత్తపేట ఆది, బీరే శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి చేరిన వారితో పరిటాల శ్రీరామ్

ఇసుక రీచ్ ఏర్పాటుపై కొనసాగుతున్న ఉద్రిక్తత



ఇసుక రీచ్ వద్ద నెలకొన్న ఉద్రిక్త పరిస్థితి

ప్రజాశక్తి - పరిగి

మండల కేంద్రంలోని జయ మంగలి నది ప్రాంతంలో ఇసుక రీచ్ ఏర్పాటు చేయరాదని రెండు రోజులుగా జరుగుతున్న స్థానికఉదయం నుండే నలుగురు ఎస్ఐలు పెనుగొండ సిఐ కరుణాకర్ ఆధ్వర్యంలో నది వద్ద పికటింగ్ ఏర్పాటుచేసి ఇసుకను తరలించాలని ప్రయత్నించినప్పటికీ స్థానిక నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఉన్న టిప్పర్లను వెంటనే నది దాటించాలని ప్రయత్నించగా పలువురు పోలీసులు స్థానిక నాయకులను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు వర్సెస్ స్థానిక నాయకులుగా ఈ రీచ్ నిర్వహణలో ఉద్రిక్తత నెలకొంది. అయితే ఈ ఇసుక రీచ్ వ్యవహారంలోఉన్నత స్థాయి ప్రజాప్రతినిధుల నుండి పోలీసులకు ఒత్తిడిలో వచ్చినట్లు తెలిసింది. అయితే స్థానిక నాయకుల సైతం ఇసుక రీచ్ ద్వారా ఎట్టి పరిస్థితుల్లోనూ ఇసుకను తరలించేందుకు ఒప్పుకునేది లేదని భూగర్భ జలాలను సంరక్షించుకోనేందుకు స్థానిక ప్రజాప్రతినిధులుగా తమ వంతు బాధ్యత ఉందని తెగేసి చెప్పారు. రీచ్ ఏర్పాటు అంత సులభంతో కాదనిఉన్నత స్థాయి అధికారులకు స్థానిక అధికారులు తెలిపినట్లు సమాచారం.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గోరంట్ల : మండలంలోని బూదిలికి వెళ్లే రహదారిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని కరావులపల్లి తండాకు చెందిన చంద్రశేఖర్ నాయక్ (30) ద్విచక్ర వాహనంలో తమ స్వగ్రామానికి బూదిలి నుండి వస్తుండగా ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్ నాయక్ అక్కడికి అక్కడే మృతిచెందాడు. మృతుడు బూదిలి వద్ద ఫ్యాక్టరీలో పనిచేస్తూ పని ముగించుకొని స్వగ్రామానికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

గడ్డివామి దగ్ధం

చిలమత్తూరు : మండల పరిధిలోని టేకులోడు గ్రామంలోని తిప్పన్న గారి గోవిందరెడ్డికి చెందిన గడ్డివామి మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు బాధిత రైతు చెబుతున్నాడు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 10 వేలు విలువ చేసే గడ్డి దగ్ధం అయిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

రొద్దం : మండలంలోని ఎం. కొత్తపల్లిలోని ఎస్సీ కాలనీక చెందిన అంజినమ్మ మంగళవారం మృతచెందింది. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ వీరేశ్ మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. అంజినమ్మ దహన సంస్కారాలు కోసం ఆయన రూ.5వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రాజేష్, రామంజి, ఓబులేసు, మూర్తి, ఎంఆర్పిఎస్ రవి, నాగరాజు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి హయాంలోనే గోరంట్ల అభివృద్ధి

గోరంట్ల : వైసిపి ప్రభుత్వం హయాంలోని గోరంట్ల మండలంలో అభివృద్ధి జరిగిందని వైసిపి మండల నాయకులు అన్నారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా బహిరంగ సభలో చెప్పిందంతా అబద్ధమన్నారు. వైసిపి ప్రభుత్వ హాయంలోనే అభివృద్ధి జరిగిందని అన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఆపార్టీ నాయకులు మధ్య నెలకొన్న వర్గపోరుతో ఎక్కడా అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు లక్ష్మీ నరసప్ప, వేణుగోపాల్ రెడ్డి, నూర్ మహమ్మద్, రామకృష్ణారెడ్డి, ధనారెడ్డి, నాగభూషణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై ప్రజావేదిక

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి నిర్వహించిన సామాజిక సర్వే అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రజావేదిక కార్యక్రమాన్ని అధికారులు మంగళవారం నిర్వహించారు. మండల వ్యాప్తంగా రూ.9.50 కోట్ల విలువైన ఉపాధి పనులు నిర్వహించగా వాటిలో రూ.1.54 కోట్లను వివిధ నిర్మాణాలకు మెటీరియల్ కు వాడుకోగా మిగిలిన సొమ్ముతో 13 పంచాయతీలలోనూ ఉపాధి హామీ పనులు నిర్వహించారు. జరిగిన పనులకు గాను మండల వ్యాప్తంగా ఈనెల 16వ తేదీ నుండి 27వ తేదీ వరకు సామాజిక తనిఖీ బృందం తనిఖీలు నిర్వహించగా మండల వ్యాప్తంగా ఎనిమిది కోట్లు పనులకు గాను కేవలం 5వేలు రూపాయలు మాత్రం అవినీతి జరిగినట్టు తెలిపారు. ఈ మొత్తాన్ని రికవరీ చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పీడీ రామాంజనేయులు, ఎంపీపీ రమణారెడ్డి, ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి , ఏపీడీ రఘునాథ్ రెడ్డి, ఎస్ఆర్పి లక్ష్మీనారాయణ, ఏపీవో మధుసూదన్ రెడ్డి, ఈసీ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

హిందూపురం : ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా బాలయేసు కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మంగళవారం రూరల్ మండలం కొటిపి పంచాయితీ ఇస్లాంపురంలో పరిశరాల శుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనాథ్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అశ్వర్థ నారాయణ, అధ్యాపకులు వేణు, హరీష్, రఘు, రమేష్, వాలంటీర్లు పాల్గొన్నారు.

చేనేతపై చిన్నచూపు : జనసేన

ధర్మవరం టౌన్ : చేనేత పరిశ్రమపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపుచూస్తోందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్రెడ్డి విమర్శించారు. పట్టణంలోని నేసేపేటలో మంగళవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో సేవ్ ధర్మవరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిలకం మధుసూదన్ రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు, చేనేతల సమస్యలను అడిగితెలుసుకున్నారు. చేనేతలకు పూర్వవైభవం రావాలంటే వైసీపీని గద్దెదించాలన్నారు.

చట్టాలను తెలుసుకోవాలి

పెనుకొండ : పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అధ్యక్షతన డివిజనల్ స్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా షెడ్యూల్ కులాలు,షెడ్యూల్ తెగలు (వేధింపుల నిరోధక) చట్టం 1989 అమలు గురించి చర్చించారు. సమావేశంలో డివిజనల్ స్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పెనుకొండ తహశీల్దారు స్వర్ణలత, ఎంపిడిఒ శివశంకరప్ప, హిందూపురం అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, గుడిబండ, మడకశిర జెడ్పీటీసీలు , రొద్దం ఎంపీపీ చంద్రశేఖర్, ఎన్జిఒలు, తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్లు విడుదల

ఓబుల దేవర చెరువు : కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగాఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సిఐటియు నాయకులు మంగళవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, రమణ, శ్రీరాములు కుల్లాయప్ప, బసీరా, తార, మంజుల, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పరిగి :ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శంకర్ నారాయణ అన్నారు. మంగళవారం పరిగి మండల కేంద్రంలోని బీరలింగేశ్వర కళ్యాణ మండపంలో నిర్వహించిన ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మతో పాటు ఆయన పాల్గొన్నారు. యువగలం పేరుతో నారా లోకేష్ చేస్తున్న పాదయాత్రను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సరస్వతి, ఎపిఎం ఫిలిప్స్, సర్పంచి లక్ష్మీదేవి, శివశంకర్, ప్రభాకర్, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులతో మంగళవారం నిర్వహించిన వైయస్సార్ ఆసరా సంబరాలలో ఎమ్మెల్యే పాల్గొని వైఎస్ఆర్ ఆసరా మూడో విడత చెక్కును విడుదల చేశారు అనంతరం రైతు ఉత్పత్తి దారుల అనుబంధం సమైక్య కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో. వెలుగు పీడీ నరసయ్య, ఎంపీడీవో డి. ఆంజినప్ప, ఎంపీపీ తాతం జగన్మోహన్, వైసిపి మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎస్ ఫయాజ్ అలీ, జెడ్పీటీసీ అమరావతి, వైస్ ఎంపిపి భారతితో పాటు ఎంపిటిసిలు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలం కేంద్రం లోని ఆర్జెహెచ్ ఫంక్షన్ హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్ఆర్ ఆసరా చెక్కును స్థానిక ఎమ్మెల్సీ ఇక్బాల్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైపిపి మండల కన్వీనర్ నారాయణ స్వామి, ఎంపీడీవో నరసింహ నాయుడు, ఎపిఎం జయచంద్ర, జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సర్పంచి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు



మోగా చెక్కును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి